క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంతో పాటు ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో శనివారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆర్మూర్ మండల అధ్యక్షుడు ములాకిడి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌లు క్లెం మోహన్ రెడ్డి, సట్లపల్లి సవిత ముఖ్య అతిథులుగా హాజరై చెక్కులను అందజేశారు. ఆలూర్ సొసైటీ చైర్మన్ క్లెం భోజారెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, ఎంపీటీసీ మల్లేష్ పాల్గొన్నారు.

కొత్తపల్లి(ఎన్)లో..

వేల్పూర్: కొత్తపల్లి(ఎన్) గ్రామంలో ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరె నితీష్ కుమార్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు, సర్పంచ్ గడ్డం నర్సారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రెండవ వార్డు కౌన్సిలర్ ఖాందేష్ శనివారం బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు..

బాల్కొండ: మెండోరా మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను శనివారం ఎంపీపీ సుకన్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ సరస్వతి, జెడ్పీటీసీ తలారి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేల విరాళం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన బాస శివకృష్ణ, మనీషా అనే అన్నచెల్లెలు కలిసి రూ.25 వేలు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు బద్రి, పెంట కిషన్, దినేష్ కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

జీలుగతో భూములు సారవంతం

రెంజల్(బోధన్): జీలుగతో భూములు సారవంతమవుతాయని ఎంపీపీ లోలపు రజని, వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. భూములకు అవసరమైన పోషకాలు లభించడం వల్ల రైతులు ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చని వివరించారు. రెంజల్ సింగిల్ విండో ఆధ్వర్యంలో శనివారం రాయితీపై జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. విండో చైర్మెన్ మొయినోద్దీన్, మౌలానా, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులకు ఆర్థిక సాయం చేయాలి

రుద్రూర్: కుల వృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేసే పథకంలో మేరు కులస్తులను చేర్చి రూ. లక్ష సహాయం అందజేయాలని వర్ని ఉమ్మడి మండల మేరు సంఘం అధ్యక్షుడు, రుద్రూర్ బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు కొలాస్ గంగాధర్ కోరారు. రుద్రూర్ మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. కులవృత్తుల వారిని ప్రోత్సహించడానికి లబ్ధిదారునికి రూ.లక్ష చొప్పున సహాయం అందించాలని ఇటీవల కేబినేట్ సమావేశంలో నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని షాదీఖానాలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రెండవ రోజు నిర్వహించిన మైనార్టీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు శనివారం ముగిశాయి. ఈ ఇంటర్వ్యూలను మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పర్యవేక్షించారు. అర్హులైన వారికి కచ్చితంగా రుణాలు వస్తాయన్నారు. రుణాలు పొందిన వారు వాటిని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సవితకు గ్లోబల్ ఫేం అవార్డు

బోధన్: ఎడపల్లి మండలంలోని అంబం గ్రామానికి చెందిన జానపద కళాకారిణి సవితకు రాష్ట్ర స్థాయి మహ్మద్ ఆర్ట్స్ గ్లోబల్ ఫేం అవార్డు దక్కింది. కళాకారిణి సవిత కొంత కాలంగా ప్రజానాట్యమండలి కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ, సామాజిక చైతన్యం గీతాలు ఆలపించి మంచి గుర్తింపు పొందింది. ఆమె ప్రతిభను గుర్తించి ఆర్ట్స్ గ్లోబల్ ఫేం అవార్డుకు ఎంపిక చేశారు. ఇటీవల హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుల నుంచి సవిత అవార్డును అందుకున్నారు.

ఊట్‌పల్లి బాధితులకు ఎమ్మెల్సీ కవిత అండ



బోధన్ రూరల్ (బోధన్): నిజామాబాద్‌లోని అర్సపల్లి బైపాస్ వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన ఊట్‌పల్లి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. శనివారం గ్రామంలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ కవిత తరపున వారి పీఏ నవీన్, బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు రూ.35 వేల చొప్పున మృతుల కుటుంబాలకు, రూ.15 వేలు చొప్పున గాయపడిన వారి కుటుంబాలకు అందజేశారు. డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?

- కంకర తేలి అధ్వానంగా మారిన ముల్లంగి(బి)–ర్యాగట్ల బీటీ రోడ్డు
- కనీసం మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కంకర తేలి గుంతలు పడ్డ ముల్లంగి (బి) - ర్యాగట్ల బీటీ రోడ్డు

మాక్లూర్: మండల కేంద్రంలోని డక్‌ఫారం నుండి ముల్లంగి(బి) వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దారి పొడవునా కంకర తేలడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. శాంతినగర్, ముల్లంగి(బి), బొంకన్‌పల్లి, గొట్టిముక్కల తదితర అనేక గ్రామాల వాహనదారులకు మండల కేంద్రానికి వెళ్లాలంటే షార్ట్ కట్ రోడ్డు ఇది. ఏడేళ్ల క్రితం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా తన ప్రత్యేక నిధులను కేటాయించి రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవటంతో పూర్తిగా కంకర తేలి, మోకాలు లోతు గుంతలు పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితికి చేరింది. వర్షం చినుకు పడితే రోడ్డంతా చిత్తడిగా మారి రాకపోకలు నిలిచి పోతున్నాయి. కొన్ని గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే చుట్టూ 5 కిలోమీటర్ల దూరం అదనంగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు మరమ్మతుల విషయమై అనేక సార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదంటూ స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా మరమ్మతులు చేపట్టాలి

ముల్లంగి(బి), ర్యాగట్ల నుంచి మండల కేంద్రానికి వెళ్లే బీటీ రోడ్డుకు వెంటనే నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలి. ఇప్పటికే ఈ రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. వర్షం పడితే కాలినడకన కూడా వెళ్లలేని విధంగా ఈ రోడ్డు మారుతుంది. మండలంలోని సుమారు 15 గ్రామాల ప్రజలు ఇదే రహదారి గుండా వెళ్తారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలి.
– ప్రమోద్, బొంకన్‌పల్లి, మాక్లూర్

నిధులు మంజూరయ్యాయి

ముల్లంగి(బి), ర్యాగట్ల నుంచి మండల కేంద్రంలోని డక్‌ఫారం వరకు ఉన్న బీటీ రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి మరమ్మతుల పనులు చేపడుతాం. –శ్రీనివాస్, పంచాయితీ రాజ్ ఏఈ, మాక్లూర్

బీజేపీ ఓబీసీ మండల కో–ఆర్డినేటర్ల నియామకం



నియామక పత్రాలను అందిస్తున్న నాయకులు

బోధన్: నియోజకవర్గంలో నూతనంగా బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా మండల కో–ఆర్డినేటర్లను నియమించారు. శనివారం పట్టణ కేంద్రంలోని పార్టీ నియోజకవర్గ నేత మేడపాటి ప్రకాష్ రెడ్డి ఆఫీసులో నియామక పత్రాలను అందజేశారు. ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్‌గా శైలేష్ కుమార్ దేశ్‌ముఖ్, బోధన్ మండల కో–ఆర్డినేటర్‌గా కొండలవాడి పోతయ్య, రెంజల్ మండల కో–ఆర్డినేటర్‌గా సగ్గు వెంకటి, నవీపేట మండల కో–ఆర్డినేటర్‌గా మంత్రి రాజేందర్ గౌడ్, ఎడపల్లి మండల కో–ఆర్డినేటర్‌గా వి. రాజేందర్‌గౌడ్, బోధన్ మండల అధ్యక్షుడిగా ఆరే పవన్‌లను నియమించారు. వీరికి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ చేతుల మీదుగా నియామకపత్రాలను అందించారు. పార్టీ నియోజకవర్గ నేత వడ్డీ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి, నాయకులు నర్సింగ్ ముదిరాజ్, కమలాకర్ రెడ్డిలు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



రెంజల్(బోధన్): సబ్‌సెంటర్ నిర్మాణ పనులను వేగవంతం చేయించాలని జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్ స్థానిక అధికారులు సూచించారు. పల్లెప్రగతి యాప్‌ను పరిశీలించేందుకు శనివారం బోర్గాం జీపీని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న సబ్‌సెంటర్ భవనం పరిశీలించారు. ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

ఇందూర్ విద్యార్థులకు అభినందనలు



బోధన్: ఇటీవల వెలువడిన పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఆచన్‌పల్లి ఇందూర్ హైస్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా శనివారం ఆర్డీవో ఆఫీసులో పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్, విద్యార్థులు ఆర్డీవో రాజేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడిన అనంతరం ఆర్డీవో విద్యార్థులను సత్కరించి అభినందించారు.

జన ఆరోగ్య సమితి కమిటీల ఏర్పాటు



సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం, ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ పీహెచ్‌సీల్లో శనివారం జన ఆరోగ్య సమితి కమిటీలను ఏర్పాటు చేశారు. దేగాం పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో జన ఆరోగ్య సమితి కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ పస్క నర్సయ్య, కో–చైర్మన్‌గా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్, కార్యదర్శిగా వైద్యాధికారి డాక్టర్ అయేషా, సభ్యులుగా ఆలూర్ తహసీల్దార్ దత్తాద్రి, వైద్యులు కోల పూజా రెడ్డి, ప్రవీణ, ఎంపీటీసీ ఉప్పునూతుల అనుష నియమితులయ్యారు. అలాగే గోవింద్‌పేట్ పీహెచ్‌సీ జన ఆరోగ్య సమితి కమిటీ కార్యదర్శిగా వైద్యాధికారిణి మానస నియమితులయ్యారు. ఎన్నికైన సభ్యులు ప్రజారోగ్యమే లక్ష్యంగా పని చేస్తారని ఎంపీపీ పస్క నర్సయ్య తెలిపారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



వర్ని: బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మె శనివారానికి 27వ రోజుకి చేరుకుంది. వర్ని తహసీల్ కార్యాలయం వద్ద బతుకమ్మ ఆడి వీవోఏలు నిరసన వ్యక్తం చేశారు. కనీసం వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అలాగే బాల్కొండ, ఆర్మూర్ పరిధిలో సమ్మె కొనసాగింది. – వర్ని/బాల్కొండ/ఆర్మూర్‌టౌన్



ముప్కాల్ మండల కేంద్రంలో..



ఆర్మూర్‌టౌన్: అంబేద్కర్ చౌరస్తా వద్ద..

సంక్షిప్తం

■ విద్యార్థికి సన్మానం

ఆర్మూర్‌టౌన్: పట్టణానికి చెందిన ఖాందేష్ శ్రీనిధ్ ఆర్మూర్ గాయత్రి జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్‌లో 981 సాధించాడని సామాజిక సేవకుడు పట్వారి తులసికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనిధ్‌ను పూలమాల శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

■ డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని డిమాండ్

నందిపేట్(ఆర్మూర్): అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్‌రూంలు అందించాలని టీడీపీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి దేగాం యాదాగౌడ్ డిమాండు చేశారు. శనివారం నందిపేటలో ఆయన మాట్లాడుతూ.. స్థలం లేని వారికి స్థలం, ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. అలాగే రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. నేతలు జావిద్, దంతాల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

■ నూతన భవన పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఔటిగల్లీలో నిర్మిస్తున్న అంబేడ్కర్ మాల సంఘం నూతన భవన పనులను శనివారం మండల పరిషత్ అసిస్టెంట్ ఇంజినీర్ నితీష్ కుమార్ పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత కలిగిన మెటీరియల్ ఉపయోగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సంఘం అధ్యక్షుడు పింజ సుదర్శన్, కార్యదర్శి బేగరి బాలరాజు, పింజ అశోక్, మురళి పాల్గొన్నారు.

■ దళితరత్న అవార్డుకు ఎంపిక



రెంజల్(బోధన్): కందకుర్తికి చెందిన మాల మహానాడు డివిజన్ నేత, డీలర్ రవీంద్రబాబుకు దళితరత్న అవార్డు లభించింది. బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం హైద్రాబాద్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్ దళితరత్న అవార్డు అందించి శాలువాతో సత్కరించారు.

■ న్యాయవాది సమ్మయ్యకు..

బోధన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం బోధన్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, సీనియర్ న్యాయవాది డాక్టర్ సమ్మయ్యకు దళితరత్న అవార్డు ప్రకటించింది. శనివారం హైదరాబాద్‌లో మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి ఆయనను అభినందించారు. అవార్డు స్ఫూర్తితో మరింతగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

■ పారిశుధ్య కార్మికులకు సన్మానం

రుద్రూర్: పొతంగల్ మండలం హంగర్గాఫారంలో పారిశుధ్య కార్మికులను శనివారం జేసీఐ స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. గ్రామస్తులకు రోగాలు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల శ్రమ ఎంతో ఉందని వారు అన్నారు. సర్పంచ్ ఎజాజ్ ఖాన్, జీపీ కార్యదర్శి నిర్మల, జెసీఐ స్ఫూర్తి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

■ ప్రభుత్వ కళాశాలలో మెరుగైన బోధన

పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన బోధన చేస్తున్నట్లు అధ్యాపకులు అన్నారు. ఆర్మూర్ మండలంలోని సుర్బిర్యాల్, ఫత్తేపూర్ గ్రామాల్లో శనివారం వారు ప్రచారం నిర్వహించారు. అధ్యాపకులు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ వార్డుల్లో పారిశుధ్య పనులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ బల్దియా ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. మరికి కాలువలను శుభ్రం చేశారు. పారిశుధ్య అధికారి శంకర్ పాల్గొన్నారు.

చందూర్ మండలం లక్ష్మాపూర్‌లో..

రుద్రూర్: చందూర్ మండలం లక్ష్మాపూర్‌లో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా చేపడుతున్న పనులను శనివారం హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి నాగభూషణం, ఎస్‌బీఎం నరేష్, రాజు పరిశీలించారు. స్థానిక సర్పంచ్ బొడ్డోళ్ల సత్యనారాయణతో కల్సి గ్రామంలో పర్యటించారు. ఎంపీడీవో నీలావతి, ఎంపీవో తారాచంద్ ఉన్నారు.

కోటగిరి, హంగర్గా ఫారంలో...

పొతంగల్ మండలం హంగర్గా ఫారం, కోటగిరి మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మండల ప్రత్యేకాధికారి రమేష్ పరిశీలించారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యదర్శులు రాజేందర్, నిర్మల, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

■ 108 అంబులెన్స్‌లో ప్రసవం

బోధన్‌టౌన్(బోధన్): భవానిపేట్‌కు చెందిన ప్రత్యూష శనివారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. ఉదయం 7.55 గంటలకు ప్రత్యూషకు పురిటి నొప్పులు రావడంతో బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది లక్ష్మణ్, జావిద్‌లు, ఆశ వర్కర్ శోభ సహకారంతో కాన్పు చేశారు. ప్రత్యూష ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలే!



పెర్కిట్: మందుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సీడ్ వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారులు హెచ్చరించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా విత్తన, ఎరువుల మందుల దుకాణాలను వ్యవసాయ అధికారులు, పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. అధికారులు మాట్లాడుతూ.. రైతులు లైసెన్స్ ఉన్న విత్తన డీ లర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. అలా గే కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. ఐఎస్ఐ సర్టిఫై కలిగిన విత్తనాలను రైతులకు విక్రయించాలని , ఏ దుకాణదారుడైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. – సాక్షి నెట్‌వర్క్



ఆర్మూర్‌టౌన్: తనిఖీ చేస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు విజయ లక్ష్మి



మాక్లూర్: తెలంగాణ ఆగ్రోస్ కేంద్రంలో..



బాల్కొండ మండల కేంద్రంలో ..



కమ్మర్‌పల్లిలో..



రెంజల్: బోర్గాంలో



వర్ని: విత్తన శుద్ధి కర్మాగారంలో తనిఖీలు



వేల్పూర్‌లో ..



సాలూరలో..ఏసీపీ కిరణ్, ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్



నందిపేటలో తనిఖీ చేస్తున్న ఏవో జ్యోత్స్న

పేదలకు 'డబుల్' ఇళ్లు అందించాలి




బాల్కొండ: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు అందించాలని సీపీఐఎంల్ ప్రజాపంథా నేతలు డిమాండ్ చేశారు. శనివారం బాల్కొండ మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవారం మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలను వారి స్వలాభం కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు.

తరుగుపై రైతుల ఆందోళన



నవీపేట: రైస్‌మిల్లులకు వెళ్లిన ధాన్యానికి రైస్ మిల్లర్లు తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని నవీపేటకు చెందిన రైతులు శనివారం సొసైటీ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. తేమ శాతంతో పాటు ధాన్యం పటిష్టంగా లేవని ఇష్టానుసారం తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. అన్‌లోడ్ అయ్యాక క్వింటాలుకు 6 నుంచి 10 కిలోల తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ న్యాలకంటి అబ్బన్న జోక్యం చేసుకుని రైస్‌మిల్లర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రెంజల్(బోధన్): కిసాన్‌తండాలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ విజయలు ప్రారంభించారు. సర్పంచ్ జాదవ్ జమున, బీఆర్ఎస్ నాయకులు లింగం, విజయ్, బీజేపీ నాయకులు సంతోష్, కిశోర్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

ఎడపల్లి(బోధన్): కుర్నాపల్లిలోని హనుమాన్ ఆలయంలో నవగ్రహ దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గాంధారి హన్మంత్ రెడ్డి–మానస దంపతులు రూ.2 లక్షలు ఖర్చు చేసి విగ్రహ ప్రతిష్ఠాపనకు దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్ర నిర్వహించారు. సర్పంచ్ సావిత్రి, ఎడపల్లి సింగిల్ విండో ఉపాధ్యక్షుడు గాంధారి అనిల్ రెడ్డి, శివాలయ చైర్మన్ సురేందర్ రెడ్డి, తదితరులున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



బోధన్‌రూరల్(బోధన్): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఆర్‌డీ హైదరాబాద్ ఆఫీస్ డిప్యూటీ ఈఈ నాగభూషణం అన్నారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం మీనార్‌పల్లి గ్రామంలో పర్యటించి పల్లె ప్రగతి, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీవో పర్బన్న, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 20, 24, 13వ వార్డుల్లో చేపడుతున్న పూడికతీత పనుల ను శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు ఆకుల రాము, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..రానున్న వర్షాకాలాన్ని దృష్టి లో పెట్టుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మురికి కాలువల్లో పూడికతీ త పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సైతం చెత్తచెదారాన్ని మురికికాలువల్లో వేయద్దన్నారు. మున్సిపల్ సానిటరీ ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

సమాచారం..

అడ్మిషన్లు ప్రారంభం

రుద్రూర్: అంబం (ఆర్) ఆదర్శ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్ తెలిపారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని, ఈ నెల 25లోగా వైబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఎలాంటి ఫీజు లేదని తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	కస్టడీ - 12.20, 6.30 ది కేరళ స్టోరీ (తెలుగు) - 3.30 విరూపాక్ష - 9.40
స్క్రీన్-2 –	ఫాస్ట్ ఎక్స్(తెలుగు)3డీ- 10.00, 4.00, 10.00 (ఇంగ్లీష్) 1.00, 7.00
స్క్రీన్-3 –	అన్నీ మంచి శకునములే - 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	బిచ్చగాడు2 - 12.15, 3.30, 6.45, 10.00